ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్మార్ట్ ఎడిషన్ Evening 6PM
సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 43 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు : 3 + https:www.prajarepublic.com + వెల - 1/-
మంగళవారం 17 సెప్టెంబర్ 2024
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

# గణపతి పూజనూ తప్పు పడుతున్నారు: విపక్షాలపై మోదీ తీవ్ర స్పందన

**సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నివాసానికి వెళ్లి గణపతి పూజలో పాల్గొనడంపై వచ్చిన విమర్శలను తాజాగా ప్రధాని మోదీ తిప్పికొట్టారు.**



(రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 17: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నివాసంలో నిర్వహించిన గణపతి పూజలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్న సంగతి తెలిసిందే. ఇది రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీసింది. విపక్షాలు చేస్తోన్న వ్యాఖ్యలపై తాజాగా ప్రధాని మోదీ స్పందించారు. దేశాన్ని విభజించేవారు గణపతి పూజను అంగీకరించలేకపోతున్నారని ఆక్షేపించారు. ఒడిశాలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడారు. 'గణేశ్ ఉత్సవం మనకు విశ్వాసానికి సంబంధించింది మాత్రమే కాదు. దేశ స్వాతంత్ర్య పోరాటం వేళ.. గణేశ్ పూజ ద్వారానే లోకమాన్య తిలక్ దేశ ప్రజలను ఐక్యం చేశారు. ఇప్పుడు కూడా ఆ పూజ ఉందంటే.. అన్నివర్గాల ప్రజలు పాల్గొంటారు. బ్రిటిషర్లు ఈ ఉత్సవాలను ఇష్టపడేవారు కాదు. కానీ ఇప్పుడు కూడా అదే పరిస్థితి కనిపిస్తోంది. సమాజాన్ని విభజించాలని కోరుకునేవారు.. వీటితో ఇబ్బంది పడుతున్నారు. నేను గణేశ్ పూజలో భాగమయ్యే సరికి కాంగ్రెస్, ఆ పార్టీ వ్యవస్థ చిరాకు పడుతోంది. కర్ణాటకలో వినాయకుడి విగ్రహాన్ని జైల్లో పెట్టారు. ఇలాంటి విద్వేషం దేశానికి ప్రమాదకరం" అని మోదీ వ్యాఖ్యానించారు. ఇదిలా ఉంటే.. సీజేఐ ఇంటికి మోదీ వెళ్లడంపై విమర్శలు వ్యక్తమైన సంగతి తెలిసిందే. ఎవరైనా సరే.. వ్యవస్థలపై వదంతులు చెలరేగే పరిస్థితులను సృష్టించడం సరి కాదని ప్రముఖ న్యాయవాది కపిల్ సిబల్ అన్నారు. ఇది తప్పుడు సంకేతం పంపిస్తుందన్న విషయాన్నైనా ఆయనకు ఎవరైనా చెప్పి ఉండాల్సిందని వ్యాఖ్యానించారు. తిరుగుబాటు శివసేన, ఎన్సీపీ ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లకు సంబంధించిన కేసుల విచారణ నుంచి సీజేఐ జస్టిస్ డి.వై. చంద్రచూడ్ తప్పుకోవాలని శివసేన(యూబీటీ) నేత, రాజ్యసభ సభ్యుడు సంజయ్ రౌత్ డిమాండ్ చేశారు. రాజ్యాంగ రక్షకులను రాజకీయ నేతలు కలవడం ప్రజల్లో అనుమానాలను రేకెత్తిస్తోందని వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. మరోపక్క.. కర్ణాటకలోని బెంగళూరులో ఇటీవల ఓ వినాయకుడి విగ్రహాన్ని పోలీసు వ్యాన్లో తరలించడం తీవ్ర వివాదాస్పదమైంది. దీనిపై ప్రధాని మోదీ సహా భాజపా నేతలు తీవ్రంగా మండిపడ్డారు. దీంతో బెంగళూరు పోలీసులు వివరణ ఇచ్చారు. "కోర్టు ఆదేశాలను ధిక్కరించి ఆందోళనకారులు నిరసనలకు యత్నించారు. ఆ సమయంలో ఆందోళనకారులను అదుపులోకి తీసుకొని విగ్రహాన్ని వ్యాన్లో పెట్టాం. ఆ తర్వాత అధికారుల సమక్షంలో సంప్రదాయబద్ధంగా వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనం చేశాం" అని వెల్లడించిన సంగతి తెలిసిందే.

# జగన్.. తిరుమల శ్రీవారితో పెట్టుకోవద్దు : మంత్రి నారా లోకేశ్

తిరుమల శ్రీవారితో పెట్టుకోవద్దని వైకాపా అధ్యక్షుడు జగన్ ను మంత్రి నారా లోకేశ్ హెచ్చరించారు.



అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 17: తిరుమల శ్రీవారితో పెట్టుకోవద్దని వైకాపా అధ్యక్షుడు జగన్ను మంత్రి నారా లోకేశ్ హెచ్చరించారు. విజయవాడలో మంత్రి సంధ్యారాణి ఇంట్లో జరిగిన పుట్టినరోజు వేడుకలు తిరుమలలో జరిగినట్టు ఫేక్ ప్రచారం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్లో పోస్ట్ చేశారు. "ఫేక్ జగన్.. నువ్వు మారవు.. నీ ఫేక్ మూకలు అస్సలు మారరు. ఫేక్ చేసీచేసి 151 నుంచి 11 సీట్లకు వచ్చావు. మంత్రి సంధ్యారాణి ఇంట్లో జరిగిన బర్త్ డే వేడుకలు తిరుమలలో జరిగినట్లు ఫేక్ ప్రచారం చేస్తున్నావు. శ్రీవారితో పెట్టుకోవద్దు.. ఏడు కొండలపై నీ విష రాజకీయాలు వాడొద్దు. ఇదే తీరు కొనసాగిస్తే ఒక్క సీటూ లేకుండా పోతావ్' అని లోకేశ్ హితవు పలికారు.

# 'లఖ్పతి దీదీ'తో 11 లక్షల మందికి ప్రయోజనం : అమిత్ షా

**మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తి చేసుకుంది. ఈసందర్భంగా గత పదేళ్లలో ఎన్డీఏ ప్రభుత్వం దేశ అభివృద్ధికి ఎంతో కృషి చేసిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు.**



దిల్లీ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 17: ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తి చేసుకుంది. ఈసందర్భంగా భారత్లో మెరుగైన రాజకీయ స్థిరత్వం ఉందని కేంద్ర హోంమంత్రి అమిత్ పేర్కొన్నారు. అదేవిధంగా ఎన్డీఏ ప్రభుత్వంలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఈమేరకు ఆయన మీడియాతో మాట్లాడారు. గత పదేళ్లలో అంతర్గత భద్రతకు ఎన్డీఏ ప్రభుత్వం పటిష్టంగా కృషి చేసిందని అమిత్ షా పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన భారత్ను నిర్మించాలనే లక్ష్యంతో ముందుకుసాగుతుందన్నారు. మోదీ 3.0 ప్రభుత్వంలో 11లక్షల మంది లఖ్పతి దీదీ పథకం కింద లబ్ధి పొందారని ఆయన వెల్లడించారు. మోదీ నాయకత్వంలో ప్రాచీన, ఆధునిక విద్యావిధానంతో కూడిన కొత్త విద్యా విధానాన్ని తీసుకొచ్చారన్నారు. ఇది ప్రాంతీయ భాషలను గౌరవిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. మూడోసారి అధికారంలోకి వచ్చాక ప్రత్యేకంగా పలు విలువైన ప్రాజెక్టులకు రూ.3 లక్షల కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. ఇక, దేశానికి నాయకత్వం వహించేలా ఎన్డీఏకు మరో అవకాశం ఇచ్చినందుకు ఈసందర్భంగా ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇదిలాఉండగా.. మూడోసారి ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తవడంతో పాటు ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా వివిధ మంత్రిత్వశాఖలు, పార్టీ నాయకులు వివరణాత్మక ప్రణాళికను రూపొందించాయన్నారు. ఇందులోభాగంగా సేవా పఖ్వాడా అనే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమాలు మంగళవారం నుంచి అక్టోబరు 2 వరకు కొనసాగుతాయన్నారు.

## జమిలి ఎన్నికలు, జనగణనపై..

దేశంలో దశాబ్దానికి ఒకసారి చేపట్టే జనగణనను త్వరలో నిర్వహించనున్నట్లు అమిత్ షా ప్రకటించారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఈ సందర్భంగా జమిలీ ఎన్నికలపైనా స్పందించారు. ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం నేతృత్వంలోనే జమిలీ ఎన్నికలు నిర్వహించాలని యోచిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఎర్రకోటపై జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లోనే ప్రధాని మోదీ ఒకే దేశం, ఒకే ఎన్నికలుపై బలంగా మాట్లాడారు. ఇక, మార్చిలో ఈ జమిలీ ఎన్నికలకు మాజీ రాష్ట్రపతి రామ్నాథ్ కోవింద్ నేతృత్వంలో ఉన్నత స్థాయి ప్యానెల్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

# గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహాగణపతి

**ఖైరతాబాద్ మహా గణపతి నిమజ్జన ప్రక్రియ ముగిసింది.**



హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 17: ఖైరతాబాద్ మహా గణపతి నిమజ్జన ప్రక్రియ ముగిసింది. వేలాది భక్తుల జయ జయ ధ్వానాల మధ్య.. ఎన్టీఆర్ మార్గ్ లోని నాలుగో నంబర్ క్రేన్ వద్ద బడా గణేశుడిని నిమజ్జనం చేశారు. అంతకుముందు ఉత్సవ కమిటీ నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక ఈ ఉదయం ప్రారంభమైన మహా గణపతి శోభాయాత్ర వైభవంగా సాగింది. మధ్యాహ్నానికి హుస్సేన్సాగర్ వద్దకు చేరుకుంది. ఈ శోభాయాత్రలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో శోభాయాత్ర మార్గంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# మద్యం విధానంపై నివేదికలు తెప్పించుకున్నాం :మంత్రివర్గ ఉపసంఘం

**మద్యం విధానంపై క్షేత్రస్థాయిలో సంఘాల నుంచి నివేదికలు తెప్పించుకున్నామని, క్యాబినెట్లో తమ నివేదికలను సమర్పిస్తామని మంత్రులు తెలిపారు.**

అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 17: మద్యం విధానంపై క్షేత్రస్థాయిలో వివిధ సంఘాల నుంచి నివేదికలు తెప్పించుకున్నామని, క్యాబినెట్లో తమ నివేదికలను సమర్పిస్తామని మంత్రులు తెలిపారు. ఏపీలో నూతన మద్యం విధానంపై సీఎం చంద్రబాబుతో మంత్రివర్గ ఉపసంఘం సమావేశమై చర్చించింది. అనంతరం మంత్రులు నాదెండ్ల మనోహర్, సత్యకుమార్, కొల్లు రవీంద్ర, కొండపల్లి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు. "గత పాలకులు జే బ్రాండ్ మద్యం తీసుకువచ్చారు. మద్యపానం నిషేధమని మాయమాటలు చెప్పి సొంత బ్రాండ్లు ప్రవేశపెట్టారు. మల్టీ నేషనల్ బ్రాండ్లు రాష్ట్రంలోకి రాకుండా అడ్డుకున్నారు. ప్రభుత్వ ఆదాయం పాలకుల జేబుల్లోకి వెళ్లింది. అర్హత లేని వ్యక్తిని డిప్యుటేషన్పై తీసుకొచ్చి వ్యవస్థను భ్రష్టుపట్టించారు. నాసిరకం బ్రాండ్లు తెచ్చి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడారు. గత ప్రభుత్వ తప్పుడు విధానాలతో రాష్ట్రం ఆర్థికంగా నష్టపోయింది. గతంలో ఎక్సైజ్ పాలసీని జేబులు నింపుకోవడానికే వాడుకున్నారు. భవిష్యత్తులో వచ్చే ఆదాయంపై కూడా అప్పులు తెచ్చారు. నాణ్యత లేని మద్యం సరఫరా చేసి ప్రజల జీవితాలతో చెలగాటమాడారు. ఆడబిడ్డల పుస్తెలతాళ్లు తెగడంతో వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ప్రజారోగ్యం దృష్ట్యా కొత్త ఎక్సైజ్విధానం రావాలి" అని అన్నారు.




# నేను ఫామ్ హౌస్ సీఎంను కాదు.. పనిచేసే సీఎంను: రేవంత్ రెడ్డి


**తెలంగాణ అంటేనే త్యాగం, బలిదానం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు పోరాడారని గుర్తు చేశారు.**



హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 17: తెలంగాణ అంటేనే త్యాగం, బలిదానం అని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి అన్నారు. రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు పోరాడారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం తరఫున పబ్లిక్ గార్డెన్స్లో ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం పోలీసులు నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అంతకుముందు ముఖ్యమంత్రి గన్పార్క్ వద్ద అమరవీరులకు నివాళులు అర్పించారు. సెప్టెంబరు 17న తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడారు. "రాష్ట్ర ప్రజలకు ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు. సెప్టెంబర్ 17న ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించాం. విమోచనం, విలీనం అంటూ స్వప్రయోజనాల కోసం ప్రవర్తించడం సరికాదు. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తిని ఎవరూ తప్పుపట్టవద్దు. పెత్తందార్లు, నియంతలపై పిడికిలి బిగించి పోరాటం చేశాం. నియంత నుంచి తెలంగాణకు స్వేచ్ఛ కల్పిస్తామని ఆనాడు భరోసా ఇచ్చాం. పదేళ్లపాటు విధ్వంసమైన తెలంగాణను మళ్లీ గాడిలో పెడుతున్నాం. పాలన పారదర్శకంగా ఉండాలని కోరుకుంటున్నాం. డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తాం. గత పదేళ్లలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం దిల్లీ వెళ్లినా విమర్శలు చేస్తున్నారు. నేను ఫామ్స్ సీఎంను కాదు.. పనిచేసే సీఎంను. మన హక్కుల సాధన కోసం ఎన్ని సార్లైనా దిల్లీకి వెళ్తాం" అని రేవంత్ రెడ్డి అన్నారు.

# నిమజ్జనం కోసం వచ్చే భక్తులకు హైదరాబాద్ సీపీ విజ్ఞప్తి

హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 17: నగరంలో వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరుగుతోందని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది సౌత్ ఈస్ట్, సౌత్ వెస్ట్లో ఉన్న విగ్రహాలు త్వరగా నిమజ్జనం అయ్యేలా చూస్తున్నామన్నారు. గతేడాది మాదిరిగా ఆలస్యం కాకుండా.. మండపం నిర్వాహకులతో మాట్లాడి త్వరగా నిమజ్జనం జరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు. "ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ప్రణాళికలు సిద్ధం చేశాం. బాలాపూర్ వినాయకుడు కూడా త్వరగా నిమజ్జనం అయ్యేలా చూస్తున్నాం. షిఫ్ట్ వారీగా 25వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశాం. నిమజ్జనంలో పోలీసులు అలసిపోకుండా షిఫ్ట్ వారీగా డ్యూటీ చేస్తున్నారు. నగరంలో దాదాపు లక్ష విగ్రహాలు ఉండొచ్చు. వాటిలో 20వేల నుంచి 30వేల విగ్రహాలు పెండింగ్ ఉన్నాయి. రేపు ఉదయం లోగా నిమజ్జనం మొత్తం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. నిమజ్జనం కోసం వచ్చే భక్తులు ప్రజా రవాణాను వినియోగించుకోవాలి" అని సీపీ ఆనంద్ తెలిపారు.





# హైదరాబాద్లో నిమజ్జనోత్సవం.. ట్యాంక్‌బండ్ పై ఇసుకేస్తే రాలనంతగా..

**భాగ్యనగరంలో గణేశ్ నిమజ్జన క్రతువు కన్నుల పండువగా సాగుతోంది.**

**వేలాది విగ్రహాలు గంగమ్మ ఒడికి చేరుతున్నాయి.**

హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 17: భాగ్యనగరంలో గణేశ్ నిమజ్జనం కన్నుల పండువగా సాగుతోంది. వేలాది విగ్రహాలు గంగమ్మ ఒడికి చేరుతున్నాయి. నిమజ్జనం సందర్భంగా ట్యాంక్బండ్ పరిసరాలు సందడిగా మారాయి. ఇసుకేస్తే రాలనంతగా భక్తులు తరలిరావడంతో కోలాహలం నెలకొంది. హుస్సేన్సాగర్లో ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనాన్ని కనులారా వీక్షించేందుకు భారీగా తరలివచ్చారు. దీంతో ట్యాంక్ బండ్, ఎన్టీఆర్ మార్గ్, తెలుగుతల్లి ఫ్లైఓవర్, సచివాలయం, ఐమాక్స్ మార్గాలు కిక్కిరిసిపోయాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా హుస్సేన్ సాగర్ పరిసరాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# హుస్సేన్సాగర్ వద్దకు సీఎం.. నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి హుస్సేన్సాగర్ వద్దకు చేరుకున్నారు. గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు.



హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 17: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి హుస్సేన్సాగర్ వద్దకు చేరుకున్నారు. గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. నగర సీపీ సీవీ ఆనంద్ ఏర్పాట్ల గురించి సీఎంకు వివరించారు. ఖైరతాబాద్ మహా గణపతి నిమజ్జన ఏర్పాట్ల గురించి సీఎం అడిగి తెలుసుకున్నారు. క్రేన్ డ్రైవర్స్, ఇతర సిబ్బంది అప్పుడప్పుడు విశ్రాంతి తీసుకునేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సీఎం సూచించారు. ట్యాంక్‌బండ్పై ఓ జీహెచ్ఎంసీ కార్మికురాలిని సీఎం పలకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీఎం వెంట పీసీసీ అధ్యక్షుడు మహేశ్కుమార్ గౌడ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో హైదరాబాద్ విమోచన దినోత్సవం

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించారు.




హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 17: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించారు. కేంద్ర మంత్రులు కిషన్రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు ఈటల రాజేందర్, కె. లక్ష్మణ్ ఈ వేడుకల్లో పాల్గొన్నారు. కిషన్రెడ్డి జాతీయ జెండా ఎగరవేసి.. భద్రతా బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అంతకుముందు అమర జవాన్ల స్తూపానికి నివాళులు అర్పించారు.

# వైద్యుల ఆందోళన వేళ.. కోల్‌కతా కొత్త పోలీస్ కమిషనర్‌గా మనోజ్ వర్మ నియామకం

కోల్‌కతా నూతన కమిషనర్ మనోజ్ కుమార్ వర్మను నియమిస్తూ బెంగాల్ ప్రభుత్వం మంగళవారం నిర్ణయం తీసుకుంది.



కోల్‌కతా, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 17: జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనను నిరసిస్తూ ఆందోళన చేస్తున్న వైద్యులతో రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చర్చలు జరిపిన సంగతి తెలిసిందే. ఆందోళనకారుల డిమాండ్ మేరకు కోల్కతా నగర పోలీస్ కమిషనర్ వినీత్ గోయల్పై వేటు పడింది. ఈ క్రమంలోనే నూతన కమిషనర్ మనోజ్ కుమార్ వర్మను నియమిస్తూ దీదీ సర్కారు మంగళవారం నిర్ణయం తీసుకుంది. వినీత్ను స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ (ఏడీజీ)గా బదిలీ చేస్తున్నట్లు వెల్లడించింది. ఆర్జీ కర్ మెడికల్ కాలేజీలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. ఆగస్టు 9న అర్ధనగ్న స్థితిలో విగతజీవిగా ఆమె కన్పించిన సంగతి తెలిసిందే. తొలుత ఆమె ఆత్మహత్య చేసుకుందని ఆసుపత్రి యాజమాన్యం చెప్పడం.. దీనిపై పోలీసులు ఆలస్యంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలోనే దీనిపై దర్యాప్తు చేపట్టిన సీబీఐ ఇటీవల కీలక విషయాలు వెల్లడించింది. కోల్కతా పోలీసులతో కలిసి ఆర్జీ కర్ ఆసుపత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ కేసును తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించారని తమ దర్యాప్తులో ప్రాథమికంగా వెల్లడైనట్లు సీబీఐ ఇటీవల కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. మరోవైపు, కోల్కతా కమిషనర్గా ఉన్న వినీత్ గోయల్.. సీఎం మమతా బెనర్జీకి నమ్మకస్థుడనే ఆరోపణలు కూడా ఉన్నాయి. దీంతో ఆయనను పదవి నుంచి తొలగించాలని ఆందోళన చేస్తున్న జూనియర్ వైద్యులతో పాటు విపక్ష నేతలు కూడా డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే సోమవారం సాయంత్రం వైద్యులతో సీఎం చర్చలు జరిపారు. వైద్య విద్యార్థుల ఐదు డిమాండ్లలో మూడింటిని అంగీకరించినట్లు సీఎం మమతా పేర్కొన్నారు. పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న కోల్‌కతా పోలీసు కమిషనర్, డిప్యూటీ కమిషనర్ తో పాటు మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కౌస్తవ్ నాయక్, హెల్ సర్వీస్ డైరెక్టర్ దేవాశిష్ హల్దేర్లను వారి పోస్టుల నుంచి తొలగించనున్నట్లు ప్రకటించారు.

# ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన సిమెంట్ లారీ.. 30 మందికి తీవ్ర గాయాలు





రాయచోటి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 17: అన్నమయ్య జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సును సిమెంట్ లోడ్తో వెళ్తున్న లారీ ఢీకొట్టింది. రామాపురం మండలం మేదరపల్లి చెక్పోస్టు వద్ద మంగళవారం తెల్లవారు జామున ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో 30 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. వేలూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న సూపర్ లగ్జరీ బస్సును కడప నుంచి రాయచోటి వైపు సిమెంట్ లోడ్తో వెళ్తున్న లారీ ఢీకొట్టింది. సమాచారం అందుకున్న రామాపురం పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి క్షతగాత్రులను కడప, రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించారు. రోడ్డుకు అడ్డంగా పడిన వాహనాలతో కడప-రాయచోటి మార్గంలో ట్రాఫిక్ నిలిచిపోయింది. జేసీబీ సహాయంతో వాహనాలు తొలగించి రాకపోకలను పోలీసులు పునరుద్ధరించారు.

# బాలాపూర్ గణేశ్ లడ్డూ రూ.30 లక్షలు

బాలాపూర్ గణేశ్ లడ్డూ వేలంపాటలో ఈసారి రికార్డు స్థాయి ధర పలికింది.



హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 17: బాలాపూర్ గణేశ్ లడ్డూ వేలంపాటలో ఈసారి రికార్డు స్థాయి ధర పలికింది. 30లక్షల 1000 రూపాయలకు కొలను శంకర్రెడ్డి దక్కించుకున్నారు. గత ఏడాది లడ్డూ రూ.27 లక్షలు పలికింది. స్థానికేతరుడైన దాసరి దయానంద్రెడ్డి లడ్డూను దక్కించుకున్నారు. వేలంపాట అనంతరం ఉదయం 11 గంటలకు బాలాపూర్ గణేశుడి శోభాయాత్ర ప్రారంభం కానుంది.

## ప్రధాని మోదీకి అంకితం..

లడ్డూను దక్కించుకున్న అనంతరం కొలను శంకర్రెడ్డి మాట్లాడారు. "బాలాపూర్ లడ్డూ మా కుటుంబానికి దక్కడం ఇది తొమ్మిదో సారి. ఈ లడ్డూను ప్రధాని మోదీకి అంకితం చేస్తున్నా" అని పేర్కొన్నారు. 1994 నుంచి బాలాపూర్లో లడ్డూ వేలం పాట కొనసాగుతోంది. మొదట రూ.450తో ప్రారంభం కాగా.. 2016లో రూ.14.65 లక్షలు, 2017లో 15.60, 2018లో 16.60, 2019లో 17.60, 2020లో 17.60, 2021లో 18.90, 2022లో 24.60 లక్షలు పలికింది. 2020 లో కరోనా కారణంగా వేలం పాట రద్దు చేశారు. బాలాపూర్ ముఖ్య కూడలిలోని బొడ్రాయి వద్ద వేలం పాట నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

# సీఎం పదవికి కేజ్రీవాల్ రాజీనామా

ఢిల్లీ సీఎం పదవికి అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను ఎల్జీ వీకే సక్సేనాకు అందజేశారు.



ఢిల్లీ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 17: ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా చేశారు. మంగళవారం సాయంత్రం లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాను కలిసిన ఆయన.. తన రాజీనామా లేఖను అందజేశారు. ఆయనతో పాటు ఆప్ శాసనసభాపక్ష నేతగా ఎన్నికైన ఆతిశీ, ఇతర మంత్రులు సైతం ఉన్నారు. కేజ్రీవాల్ రాజీనామాను ఎల్జీ ఆమోదించాక.. త్వరలోనే ఆతిశీ కొత్త సీఎంగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. డిప్యూటీ సీఎంగా ఎవరూ ఉండరని, ఆతిశీ సెప్టెంబర్ 26-27 తేదీల్లో జరిగే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉందని సమాచారం. ఆతిశీని తదుపరి సీఎంగా ఎంపిక చేయడంపై మంత్రి గోపాల్ రాయ్ మాట్లాడారు. "పరీక్ష కాలంలో ఆతిశీకి ఈ బాధ్యతలు అప్పగించాం. ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ఏజెన్సీలను దుర్వినియోగం చేస్తున్నారు. అలాంటి ప్రయత్నాలను ఆప్ భగ్నం చేసింది" అన్నారు. ఢిల్లీ మద్యం విధానం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై సీఎం కేజ్రీవాల్ అరెస్టయిన విషయం తెలిసిందే. ఇటీవల తిహాడ్ జైలు నుంచి విడుదలైన ఆయన సీఎం పదవికి రాజీనామా చేస్తానని ఆదివారం ప్రకటించారు. ఇందులో భాగంగా మంగళవారం తన రాజీనామాను ఎల్జీకి అందజేశారు. ఢిల్లీ ప్రజలు తనకు నిజాయతీపరుడని సర్టిఫికెట్ ఇచ్చే వరకు ఆ పదవిని చేపట్టబోనని ఆయన ప్రతినబూనారు.

## వివేకా కుమార్తె సునీత ఫిర్యాదు.. సానుకూలంగా స్పందించిన సీఎం చంద్రబాబు

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత దంపతులు మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు.

అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 17: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత దంపతులు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. వివేకా పీఏ కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు.. అప్పటి సీబీఐ ఎస్పీ రాంసింగ్తో పాటు తమపై అక్రమ కేసు పెట్టారని సీఎం దృష్టికి తెచ్చారు. కృష్ణారెడ్డి ఫిర్యాదులో నిజానిజాలపై విచారణ చేయించాలని కోరారు. రాంసింగ్పై కేసు వంటి అంశాలపై విచారణ చేయించాలని విజ్ఞప్తి చేశారు. సీఐడీ విచారణ ద్వారా వాస్తవాలు బయటకు తేవాలని కోరారు. సునీత విజ్ఞప్తిపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. తనకు అన్ని విషయాలు తెలుసని.. విచారణ చేయిస్తానని హామీ ఇచ్చారు.



# పర్మిట్ రూం వేళలు మార్చేలా సీఎంతో చర్చిస్తా :ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

మద్యానికి బానిసైతే కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతాయని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు.



మునుగోడు,(రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 17: మద్యానికి బానిసైతే కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతాయని మునుగోడు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. మద్యం దుకాణాల పక్కన కొనసాగే పర్మిట్ రూమ్లకు సాయంత్రం 6 గంటల నుంచి మాత్రమే అనుమతివ్వాలని, దీన్ని మునుగోడు నుంచి పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించి రాష్ట్రవ్యాప్తంగా అమలయ్యేలా సీఎం రేవంత్రెడ్డితో చర్చిస్తానన్నారు. నల్గొండ జిల్లా మునుగోడు నియోజకవర్గ కేంద్రంలోని మద్యం దుకాణాలను సోమవారం ఉదయం 10.30 గంటలకు ఆయన తనిఖీ చేసి కల్తీవి విక్రయిస్తున్నారా అని ఆరా తీశారు. అదే సమయంలో పక్కనున్న పర్మిట్ రూమ్లో మద్యం తాగుతున్న వారితో మాట్లాడారు. ఉదయం పూటనే మద్యం తాగితే ఆరోగ్యం ఏమవుతుందని, కుటుంబ పరిస్థితి గురించి ఆలోచించాలని వారికి సూచించారు. స్థానిక మద్యం దుకాణాల నిర్వాహకులే నాలుగైదు గ్రామాల మధ్య ఓ సబ్ దుకాణం ఏర్పాటు చేసి సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మద్యం విక్రయిస్తే బాగుంటుందని, దీనివల్ల ఆదాయం పెరిగి గొలుసు దుకాణాల నిర్మూలనకు ఆస్కారముంటుందని అభిప్రాయపడ్డారు.

# కొంపలేం మునిగిపోవు.. 'బుల్డోజర్ న్యాయం' ఆపండి: సుప్రీం కోర్టు

'బుల్డోజర్ న్యాయం'ను తక్షణమే ఆపాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. అక్టోబర్ 1వ తేదీ వరకు తమ ఆదేశాలు అమల్లో ఉంటాయని వెల్లడించింది.



(రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 17: ఇప్పటికిప్పుడు 'బుల్డోజర్ న్యాయం' చేయడంపై సుప్రీం కోర్టు అసహనం వ్యక్తం చేసింది. దేశవ్యాప్తంగా ఇటీవల కాలంలో వివిధ రాష్ట్రాలు విచారణలో ఉన్న నేరగాళ్ల ఇళ్లు, ప్రైవేటు ఆస్తులపైకి బుల్డోజర్లను నడిపించే విషయంలో బాధితులకు ఉపశమనం ఇవ్వడం, దేశస్థాయిలో మార్గదర్శకాల తయారీపై నేడు న్యాయస్థానం విచారణ చేపట్టింది. జస్టిస్ బి.ఆర్. గవాయ్ నేతృత్వంలోని బెంచ్ వాదనలు వినింది. అనధికారికంగా జరిపే ఇటువంటి బుల్డోజర్ చర్యలను అక్టోబర్ 1వ తేదీ వరకు నిలిపివేయాలని పేర్కొంది. మరోవైపు వీటిని ఆపితే ఆక్రమణల తొలగింపు ఆలస్యమవుతుందన్న ప్రభుత్వ భయాలను కొట్టిపారేసింది. "వచ్చే విచారణ తేదీ వరకు మీ చర్యలను ఆపమని మేం కోరినంత మాత్రాన కొంపలేం మునిగిపోవు" అని జస్టిస్ బి. ఆర్. గవాయ్, కె.వి. విశ్వనాథన్ వ్యాఖ్యానించారు. ఈ నెలలో ఇప్పటికే రెండు సార్లు వివిధ రాష్ట్రాలు చేపట్టిన 'బుల్డోజర్ చర్యల'పై న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ప్రాక్టీస్ను హీరోయిజంగా చూపే యత్నం చేయవద్దని హెచ్చరించింది. తమ అనుమతులు లేకుండా ఎటువంటి కూల్చివేతలు చేపట్టొద్దని తేల్చిచెప్పింది. దీనిపై ఎన్నికల కమిషన్కు కూడా నోటీసులు జారీ చేస్తామని వెల్లడించింది. మహారాష్ట్ర, ఝార్ఖండ్, జమ్మూ కశ్మీర్, హరియాణల్లో అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో ఈసీకి నోటీసులు ఇస్తామని చెప్పడం ప్రాధాన్యం సంతరించుకొంది. ఈ రాష్ట్రాల్లో చాలా చోట్ల భాజపా అధికారంలో ఉంది. అదే సమయంలో బహిరంగ స్థలాలు, రైల్వే ఆస్తులు, నీటి వనరుల ఆక్రమణల తొలగింపు విషయంలో మాత్రం తమ ఆదేశాలు వర్తించవని తేల్చిచెప్పింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే, సియూ సింగ్ వాదనలు వినిపించారు. ఇప్పటికే సెప్టెంబర్ 2వ తేదీన జరిగిన వాదనల్లో దేశంలో ఎక్కడా ఈ తరహా చర్యల్లో మార్గదర్శకాలను పాటించడంలేదని పేర్కొన్నారు. ఈ కేసులో ప్రధాన పిటిషనర్గా జామత్ ఉలేమా హింద్ వ్యవహరిస్తోంది. కూల్చివేతలకు ముందు కనీసం 40-60 రోజుల ముందుగా నోటీసులు జారీ చేయాలని, చట్ట వ్యతిరేక కూల్చివేతలకు సదరు అధికారులను బాధ్యులను చేయాలని ఆ సంస్థ సుప్రీంకు నివేదించింది. యూపీ ప్రభుత్వం పక్షాన సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- విశ్వకర్మ జయంతి
- 1879: నాస్తికవాది, సంఘసంస్కర్త ఇ.వి. రామస్వామి నాయకర్ జననం (మ.1973).
- 1882: ఆధునిక ఆంధ్ర చిత్రకారులకు ఆదిగురువు ఆస్వాల్డ్ కూల్డ్రే జననం (మ.1958).
- 1906: గాంధేయవాది, స్వాతంత్ర్య సమర–యోధుడు వావిలాల గోపాలకృష్ణయ్య జననం (మ.2003).
- 1915: భారతదేశపు చిత్రకారుడు ఎం.ఎఫ్. హుసేన్ జననం (మ.2011).
- 1922: నాటక రచయిత ముత్తరాజు సుబ్బారావు మరణం (జ.1888).
- 1925: రచయిత్రి, చిత్రకారిణి శివరాజు సుబ్బలక్ష్మి జననం.
- 1930: కర్ణాటక సంగీత విద్వాంసుడు లాల్గుడి జయరామన్ జననం (మ.2013).
- 1937: భారతీయ కవి, సాహిత్య విమర్శకుడు సీతాకాంత్ మహాపాత్ర జననం.
- 1948: తెలంగాణ విమోచన దినోత్సవం
- 1950: భారతీయ జనతా పార్టీ నాయకుడు, భారత 14వ ప్రధానమంత్రి నరేంద్ర మోడి జననం.


విశ్వకర్మ జయంతి


ఇ.వి. రామస్వామి నాయకర్





గోపాలకృష్ణయ్య


ఎం.ఎఫ్. హుసేన్


ముత్తరాజు సుబ్బారావు


శివరాజు సుబ్బలక్ష్మి


జయరామన్


సీతాకాంత్


గోపాలకృష్ణమూర్తి


నరేంద్ర మోడి

## అప్పుడు.. నా బాధ ఆమెకు అర్థమైంది : మాళవికా మోహనన్

రజనీకాంత్, రేఖ గురించి ప్రత్యేకంగా మాట్లాడారు మాళవికా మోహనన్. త్వరలోనే ఆమె 'యుద్రా' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు.

బాలీవుడ్ ప్రముఖ నటి రేఖతో తన పరిచయాన్ని గుర్తుచేసుకున్నారు కోలీవుడ్ బ్యూటీ మాళవికా మోహనన్. తన కొత్త సినిమా 'యుద్రా' ప్రచారంలో భాగంగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో ఒకప్పటి సంగతులు నెమరువేసుకున్నారు. ఇతరులను ప్రోత్సహించడంలో ముందుంటారంటూ రేఖ, రజనీకాంత్ పై ప్రశంసలు కురిపించారు. "ఓ అవార్డుల వేడుకలో రేఖను తొలిసారి నేరుగా చూశా. ఆమె పక్కనే కూర్చొన్నా. డిన్నర్ చేశావా? ఎక్కడి నుంచి వచ్చావ్? అంటూ యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆమె మాట్లాడే విధానం ఆకట్టుకుంది. ఓవైపు ఆనందంగా ఉన్నా మరో వైపు.. నాకు పురస్కారం (బియాండ్ ది క్లౌడ్స్ సినిమాకిగానూ) వస్తుందా? అనే ఉత్కంఠ నెలకొంది. చివరకు.. నాకు అవార్డు దక్కకపోవడంతో బాధపడ్డా. పైకి కనిపించకుండా మేనేజ్ చేశా. కానీ, నా బాడీ లాంగ్వేజ్ పరిశీలించిన రేఖకు నా ఫీలింగ్ అర్థమైంది. 'ఫర్వాలేదు.. భవిష్యత్తులో నువ్వు ఎన్నో పురస్కారాలు పొందుతావు' అంటూ నన్ను ప్రోత్సహించారు. రజనీకాంత్ గురించి మాట్లాడుతూ.. "కోలీవుడ్లో నేను నటించిన తొలి సినిమా 'పేట'. అందులో నేను కీలక పాత్ర పోషించా. నేను ఎక్కడి నుంచో వచ్చానో, నా కుటుంబం గురించి రజనీకాంత్ కు తెలుసు. ఆయన పెద్ద స్టార్ అయినా.. నేను కంఫర్ట్ ఉన్నానో లేదోనని అడిగేవారు. ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకున్నారు" అని పేర్కొన్నారు. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కె.యు. మోహనన్ కుమార్తె మాళవిక. 'మాస్టర్', 'తంగలాన్' తదితర చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను అలరించారు. సిద్ధాంత్ చతుర్వేది సరసన ఆమె నటించిన 'యుధ్రా' ఈ నెల 20న విడుదల కానుంది. ప్రభాస్ 'ది రాజాసాబ్, కార్తి 'సర్దార్ 2'తో ప్రస్తుతం బిజీగా ఉన్నారు.



రిపబ్లిక్ సినిమా CINEMA

## 'యానిమల్' రికార్డు దాటేసిన 'స్త్రీ 2'.. బాలీవుడ్ చరిత్రలో మరో ఘనత

'స్త్రీ2' సినిమా మరో ఘనతను సాధించింది. బాలీవుడ్లో అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగా రికార్డు నెలకొల్పింది.



బాలీవుడ్ నటీనటులు శ్రద్ధాకపూర్, రాజ్కుమార్ రావు జంటగా నటించిన చిత్రం 'స్త్రీ 2'. కామెడీ హారర్ ఫిల్మ్‌గా ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమాకు అమర్ కౌశిక్ దర్శకత్వం వహించారు. బాక్సాఫీసు వద్ద సత్తా చాటుతోన్న ఈ చిత్రం తాజాగా మరో ఘనత సాధించింది. గతేడాది విడుదలై సంచలనం సృష్టించిన 'యానిమల్' రికార్డులను దాటేసింది. సందీప్ వంగా దర్శకత్వంలో రణబీర్ కపూర్ నటించిన చిత్రం ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లు సాధించిన సంగతి తెలిసిందే. బాలీవుడ్లో లోనూ ఈ చిత్రం మంచి కలెక్షన్లు సొంతం చేసుకుంది. తాజాగా వాటిని శ్రద్ధాకపూర్ 'స్త్రీ2' దాటేసింది. 'యానిమల్ చిత్రం అక్కడ రూ.553 కోట్లు వసూలు చేయగా.. 'స్త్రీ2' రూ.557 కోట్లు సాధించింది. దీంతో బాలీవుడ్ చరిత్రలో అత్యధిక కలెక్షన్లు సాధించిన సినిమాల లిస్ట్లో రెండో స్థానంలో నిలిచింది. మొదటి స్థానంలో రూ.640కోట్లతో షారుక్ నటించిన 'జవాన్' ఉంది. శ్రద్ధాకపూర్ రాజ్కుమార్రావు జోడీ 'స్త్రీ2'తో మరోసారి హిట్ అయ్యింది. ఆగస్టు 15న విడుదలైన పలు స్టార్ హీరోల చిత్రాలు 'వేదా' (జాన్ అబ్రహం), ఖేల్ ఖేల్ మే (అక్షయ్కుమార్)కు ఈ సినిమా గట్టి పోటీ ఇచ్చింది. శ్రద్ధాకపూర్ కెరీర్లో అత్యధిక వసూళ్లు రాబట్టిన చిత్రంగా ఇది నిలవడం విశేషం.

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

## ఆ రెండు రికార్డులకు ఆరు వికెట్ల దూరంలో జడేజా.. యువ ఆటగాడికి గిఫ్ట్ ఇచ్చిన కోహ్లి

టీమ్ ఇండియా ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా టెస్టుల్లో మరో ఆరు వికెట్లు పడగొడితే రెండు రికార్డులను అందుకుంటాడు.

టెస్టుల్లో ప్రపంచ నంబర్వన్ ఆల్రౌండర్ గా కొనసాగుతున్న రవీంద్ర జడేజా.. సుదీర్ఘ ఫార్మాట్లో రెండు రికార్డులపై కన్నేశాడు. ఈ స్పిన్నర్ మరో ఆరు వికెట్లు పడగొడితే టెస్టుల్లో 300 వికెట్ల మైలురాయిని అందుకున్నాడు. దీంతో భారత్ తరపున ఈ ఘనత సాధించిన ఏడో బౌలర్గా రికార్డుల్లోకెక్కుతాడు. ప్రస్తుతం ఈ క్లబ్లో అనిల్ కుంబ్లే (619), అశ్విన్ (516), కపిల్ దేవ్ (434), హర్భజన్ సింగ్ (417), ఇషాంత్ శర్మ (311), జహీర్ ఖాన్ (311) ఉన్నారు. ఆరు వికెట్లు సాధిస్తే జడేజా మరో రికార్డునూ అందుకోనున్నాడు. సుదీర్ఘ ఫార్మాట్లో 3000 కంటే ఎక్కువ పరుగులు చేయడంతోపాటు 300 వికెట్లు సాధించిన మూడో భారత క్రికెటర్ నిలవనున్నాడు. కపిల్ దేవ్ (5248 పరుగులు), అశ్విన్ (3309 పరుగులు) ఇప్పటికే ఈ జాబితాలో ఉన్నారు. బంగ్లాదేశ్తో జరగనున్న రెండు టెస్టుల సిరీస్కు ఎంపికైన రవీంద్ర జడేజా ఇప్పటివరకు 72 టెస్టులు ఆడి బ్యాటర్గా 3036 పరుగులు, బౌలర్గా 294 వికెట్లు సాధించాడు. సెప్టెంబరు 19 నుంచి బంగ్లాదేశ్తో జరిగే తొలి టెస్టులో జడేజాకు తుది జట్టులో చోటు దక్కడం దాదాపు ఖాయమైంది.

### యువ ఆటగాడికి బ్యాటును గిఫ్ట్ ఇచ్చిన కోహ్లి

దులీప్ ట్రోఫీలో అదరగొట్టిన ఆకాశ్ దీప్ మరోసారి భారత జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఈ యువ పేసర్ బంగ్లాదేశ్తో జరగనున్న తొలి టెస్టుకు ఎంపికైన విషయం తెలిసిందే. ప్రస్తుతం భారత జట్టుతో కలిసి అతడు ప్రాక్టీస్ చేస్తున్నాడు. ఈసందర్భంగా ఆకాశ్కు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి బ్యాటును గిఫ్ట్ ఇచ్చాడు. దీనికి సంబంధించిన చిత్రాన్ని ఆకాశ్ దీప్ సోషల్ మీడియాలో పంచుకుంటూ "థాంక్ యూ బిగ్ బ్రదర్" అని క్యాప్షన్ ఇచ్చాడు. కోహ్లి ఆకాశ్ దీప్ ఇప్పటికే టెస్టుల్లో భారత్ తరపున అరంగేట్రం చేశాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇంగ్లాండ్పై అరంగేట్రం చేసి మూడు వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్లో కోహ్లితో కలిసి ఆర్సీబీకి ప్రాతినిధ్యం వహించాడు.



## ఆరోగ్యం

## కొబ్బరి తింటే కొలెస్ట్రాల్ పెరుగుతుందా

కొబ్బరి తింటే చాలా హెల్దీ అంటారు. కానీ, దీనిని తినడం వల్ల కొన్నిసమస్యలు ఉన్నాయని చెబుతారు. అందులో కొలెస్ట్రాల్ పెరగడం. దీనిలో నిజమెంతో తెలుసుకోండి. నేటి కాలంలో చాలా మంది కొలెస్ట్రాల్‌తో బాధపడుతున్నారు. దీనికి మనం తీసుకునే ఆహారం, అన్‌హెల్దీ లైఫ్‌స్టైల్ కారణమే. ఈ నేపథ్యంలోనే కొబ్బరి తింటే కొలెస్ట్రాల్ పెరుగుతుందని కొంతమంది నమ్ముతుంటారు. కొలెస్ట్రాల్ పెరగడానకి ముఖ్య కారణం ఆయిలీ ఫుడ్స్ తీసుకోవడం. కొబ్బరిలో కూడా ఆయిల్ శాతం పెరగడం వల్లే కొలెస్ట్రాల్ పెరుగుతుందనుకుంటారు. మరి దీని గురించి నిపుణులు ఏం చెబుతున్నారో తెలుసుకోండి.



### కొబ్బరిని వాడడం..

కొబ్బరిని వంటల్లో వాడతారు. కూరలు దగ్గర్నుంచి స్వీట్స్ వరకూ ఆ రెసిపీ ఎక్స్‌ట్రా టేస్ట్ యాడ్ చేస్తుంది. అందుకే, దీనిని ఎక్కువగా వాడతారు. కొబ్బరిని తుర–ుములా చేసి వంటల్లో వాడతారు. అసలు ఇలా తింటే నిజంగానే కొలెస్ట్రాల్ పెరుగుతుందా అంటే..


### సైన్స్ ప్రకారం..



కొబ్బరిలో ఫినాల్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి హై కొలెస్ట్రాల్‌ని తగ్గిస్తాయి. ఆక్సీకరణ నష్టాన్ని తగ్గించడం ద్వారా కణాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. దీని వల్ల హై కొలెస్ట్రాల్ ప్రమాదం తగ్గుతుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. కొబ్బరినూనెలో కూడా గొప్ప గుణాలు ఉన్నాయి. ఇవన్నీ ఆరోగ్యానికి చాలా మంచివి. ఇవి కొలెస్ట్రాల్ సమస్యల్ని తగ్గిస్తాయి. అయితే, ఇది సరిగ్గా తీసుకున్నప్పుడు మాత్రమే. లేదంటే, దీని వల్ల సమస్యలొస్తాయి.



### ఆయుర్వేదం ప్రకారం..



కొబ్బరి చాలా మంచిది. ఆయుర్వేదం కొలెస్ట్రాల్‌ని శరీరంలోని జీర్ణాశయాన్ని ఎఫెక్ట్ చేస్తుంది. దీని వల్ల జీర్ణ సమస్యలు వస్తాయి. దీంతో శరీరంలో వ్యర్థాలు పేరుకుపోతాయి. ఇవన్నీ చెడు కొలెస్ట్రాల్‌ని పెంచుతాయి. కొబ్బరి, కొబ్బరి నూనె అగ్నిని బ్యాలెన్స్ చేస్తాయి. టాక్సిన్స్‌ని తొలగిస్తాయి. జీర్ణక్రియ మెరుగ్గా చేస్తాయి. ఇవన్నీ కొలెస్ట్రాల్‌ని తగ్గిస్తాయి.

### కొబ్బరి పాలు..

కొబ్బరి పాలని వాడడం మంచిది. అయితే, కొబ్బరి పాల కంటే కొబ్బరిని అసలు రూపంలో తినడమే మంచిది. పాలు తయారు చేసేటప్పుడు అందులోని పీచు పదార్థం తగ్గుతుంది. కొబ్బరినీరు ఆరోగ్యానికి చాలా మంచిది.

### కొలెస్ట్రాల్ పెరగడం..



కొబ్బరిని ఎక్కువగా తింటే కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయి. కొబ్బరినూనెలో సంతృప్త కొవ్వు ఎక్కువగా ఉంటుంది. ఇతర మొక్కల ఆధారిత నూనెల కంటే ఇది చాలా మంచిది. అయితే, దీనిని తీసుకోవడం వల్ల మంచి, చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయి. అయినప్పటికీ, కొబ్బరినూనెలో లారిక్ యాసిడ్ అనే సంతృప్త కొవ్వు ఉంటుంది. ఇది మంచి కొలెస్ట్రాల్‌ని పెంచుతుంది.

### ముఖ్య విషయాలు..

కొబ్బరితో ఆహారాన్ని తినడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. టిన్డ్ కొబ్బరిపాలు..కొబ్బరిపాలలో కొవ్వు, సంతృప్త కొవ్వు ఎక్కువగా ఉంటుంది. ఇది కొలెస్ట్రాల్‌కి మంచిది కాదు. ఇతర హెల్దీ ఫ్యాట్స్..ఆలివ్, అవకాడో, కనోలా నూనెలు కొబ్బరినూనె కంటే గుండెకి మంచివి. మీ డైట్‌లో నట్స్, ఆయిలీ ఫిష్, అవకాడో వంటి ఇతర హెల్దీ ఫ్యాట్స్‌ని కూడా యాడ్ చేసుకోవచ్చు.


గమనిక: ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఇవి పాటించడం వల్ల ఫలితాలు అనేవి వ్యక్తిగతం మాత్రమే. వీటిని పాటించే ముందు డైటీషియన్‌ని సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.

### మితంగా..



కొబ్బరి మాత్రమే కాదు.. కొబ్బరినూనెని కూడా మితంగా వాడాలి. అప్పుడే కొలెస్ట్రాల్ కంట్రోల్ అవుతుంది. దీనిని ఎక్కువగా ఫ్రై చేసి తినొద్దు. సాధారణంగా కొద్దిగా మాత్రమే ఉడికించి తినాలి. అప్పుడే బెనిఫిట్స్ అందుతాయి.

### ఫ్రై చేసి..



కొబ్బరిని తక్కువ మోతాదులో తీసుకుంటేనే మంచిది. దీనిని తురుము వేసి కూరలో వేసుకోవచ్చు. దీనిని ఫ్రై చేసి కూరల్లో వాడొద్దు. ఎందుకంటే ఫ్రై చేసినప్పుడు అందులో నీరు తగ్గుతుంది. సుగంధ పాలీసైక్లిక్ హైడ్రోకార్బన్స్ ఏర్పడతాయి. ఇది కార్బన్ కలయిక. దీని వల్ల అసిడిటీ, గుండెల్లో మంట, పేగు సమస్యలు వస్తాయి. అంతేకాకుండా కొలెస్ట్రాల్ పెరుగుతుంది. ఫ్రై చేస్తే రుచి పెరిగినప్పటికీ ఆరోగ్యానికి మంచిది కాదని గుర్తుంచుకోండి.

